సాక్షి
రాజన్న సిరిసిల్ల
గురువారం । 5 । సెప్టెంబర్ । 2024



నిండుకుండలా మిడ్‌మానేరు

వరుసగా కురుస్తున్న వర్షాలతో మిడ్‌మానేరు నిండుకుండలా మారింది. పదిహేను రోజుల క్రితం బోసిపోయి కనిపించిన ప్రాజెక్టు నేడు జలకళతో ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం 21 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల

న్యూస్‌రీల్

డీఎస్‌వోగా వసంతలక్ష్మి



వసంతలక్ష్మి, డీఎస్‌వో

సిరిసిల్ల: జిల్లా పౌరసరఫరాల అధికారిణి(డీఎస్‌వో)గా పి.వసంతలక్ష్మి విధుల్లో చేరారు. గతంలో జిల్లాలో డీఎస్‌వోగా పనిచేసిన ఎస్.జితేందర్‌రెడ్డి జగిత్యాల జిల్లాకు బదిలీ కాగా.. ఆయన స్థానంలో వసంతలక్ష్మి వరంగల్ నుంచి బదిలీపై వచ్చారు. జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎమ్మార్) లక్ష్యాన్ని గడువులోగా సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలోని రైస్‌మిల్లులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సీఎమ్మార్ సాధించేలా చూస్తామన్నారు.

ఇంజినీరింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- మిడ్‌మానేరు ప్రాజెక్టును పరిశీలించిన ఈఎన్‌సీ



మిడ్‌మానేరు ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఈఎన్‌సీ శంకర్, ఈఈ జగన్

బోయినపల్లి(చొప్పదండి): వర్షాలు కురుస్తున్నందునా మిడ్‌మానేరు ఇంజినీరింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ ప్రాజెక్టుల ఈఎన్‌సీ శంకర్ పేర్కొన్నారు. బోయినపల్లి మండలం మాన్వాడ మిడ్‌మానేరు ప్రాజెక్టును బుధవారం సందర్శించారు. ఈఎన్‌సీ శంకర్ మాట్లాడుతూ ప్రాజెక్టు ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లోను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. ప్రాజెక్టులో నీటిమట్టం, ఇన్‌ఫ్లో, ఎస్సారెస్పీ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో, ప్రాజెక్టు నుంచి వెళ్తున్న ఔట్‌ఫ్లో వివరాలను మిడ్‌మానేరు ఈఈ జగన్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు పవర్‌ప్యాక్ గేట్ల గదులను పరిశీలించారు. డీఈ అప్పన్నగారి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

12, 19, 24, 26 తేదీల్లో సదెరం శిబిరాలు

సిరిసిల్ల: జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఈనెల 12, 19, 24, 26 తేదీల్లో సదెరం శిబిరాలు నిర్వహిస్తున్నామని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ నాగార్జున చక్రవర్తి బుధవారం తెలిపారు. జిల్లాలోని దివ్యాంగులకు సెప్టెంబరు 12న ఆర్థో(ఎముకలు), 19న మానసిక, 24న వినికిడి, 26న కంటిచూపు పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. దివ్యాంగులు మీసేవ కేంద్రం ద్వారా స్లాట్ బుక్ చేసుకొని శిబిరాలకు రావాలని తెలిపారు. దివ్యాంగులు సంబంధిత మెడికల్ డాక్యుమెంట్లు, ఎక్స్–రే, ఫోన్ నంబర్ వెంట తీసుకుని రావాలని సూచించారు.

పారదర్శకంగా ప్లాట్ల క్రమబద్ధీకరణ

- జిల్లా టౌన్‌ప్లానింగ్ అధికారి అన్సారీ



మాట్లాడుతున్న అన్సారీ

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): అనధికార లేఅవుట్, ప్లాట్ల క్రమబద్ధీకరణలో మండలాల కార్యదర్శులు పారదర్శకంగా వ్యవహరించాలని జిల్లా టౌన్‌ప్లానింగ్ అధికారి ఎండీ అన్సారి, డివిజనల్ పంచాయతీ అధికారి జోగం రాజు సూచించారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్‌లో బుధవారం గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల పంచాయతీ కార్యదర్శులకు ఎల్ఆర్ఎస్‌పై శిక్షణ తరగతులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ 2020లో వచ్చిన దరఖాస్తులను కలెక్టర్ అనుమతికి పంపించాలని సూచించారు. జిల్లా అధికారులు బొర్ల బోరయ్య, లింగాల రాజేశ్వర్‌గౌడ్, నాలుగు మండలాల కార్యదర్శులు పాల్గొన్నారు.


డీఐఈవో తనిఖీ



మాట్లాడుతున్న డీఐఈవో శ్రీనివాస్

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి వై.శ్రీనివాస్ బుధవారం తనిఖీ చేశారు. పాఠ్యాంశాల బోధనను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. శ్రీనివాస్ మాట్లాడుతూ చదువుతోపాటు సహ పాఠ్యాంశాల్లోనూ ముందుండాలని సూచించారు. ప్రిన్సిపాల్ వనజకుమారి, లెక్చరర్లు క్యాతం సత్యనారాయణ, వాసరవేణి పర్శరాములు, చెరుకు భూమక్క, బుట్ట కవిత, నీరటి విష్ణుప్రసాద్ ఉన్నారు.

భవితకు బాటసార్లు!



- వివరాలు 8లో▸

అమ్మ ఊపిరి పోస్తుంది. నాన్న నడక నేర్పిస్తాడు. గురువు జీవితాన్ని ఇస్తాడు. గురువు బోధనలే భవిష్యత్‌కు పునాదులు. మారుతున్న కాలానికి అనుగుణంగా బట్టీ చదువులను పక్కకు పెట్టిన టీచర్లు వినూత్న బోధనకు శ్రీకారం చుట్టారు. పుస్తకాలతో కుస్తీ పట్టకుండా ప్రయోగాత్మకంగా పాఠాలు చెబుతున్నారు. పుస్తకంలోని పాఠాన్ని కళ్లకు కట్టినట్లు చూపుతూ.. విద్యార్థుల్లో జ్ఞానాన్ని నింపుతున్నారు. టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ డిజిటలైజేషన్‌లో ముందుకు సాగుతున్నారు. సర్కారు బడుల్లో ఉత్తీర్ణతశాతాన్ని పెంచుతూ విద్యార్థుల భవితకు బాటసార్లుగా నిలుస్తున్నారు. పాఠశాల దశలో వీరి బోధనలను అవపోసన పట్టిన పలువురు వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. నేడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని పలువురు ఉత్తమ ఉపాధ్యాయులపై ప్రత్యేక కథనం..!!

53 మంది విద్యార్థులతో ఆవిష్కరణలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:



విద్యార్థులకు ప్రయోగాత్మకంగా పాఠాలు బోధిస్తున్న సంపత్

రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో ఫిజిక్స్ టీచర్‌గా పనిచేస్తున్న సంపత్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకోనున్నారు. పాఠ్యాంశాలను ప్రయోగాత్మకంగా బోధించడం ఆయనకు అలవాటు. పెద్దపల్లి జిల్లా యైటింక్లయిన్ కాలనీకి చెందిన సంపత్ చిన్ననాటి నుంచి ఇస్రోలో శాస్త్రవేత్త కావాలని కలలు కనేవారు. చివరికి ఎంపికైనా సాంకేతిక కారణాలతో తప్పుకోవాల్సి వచ్చింది. అయినా, ఆయన నిరుత్సాహ పడలేదు. తనకున్న తెలివితేటలతో విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని భావించారు. మిషన్–100 లక్ష్యంతో పని చేస్తున్నారు. ఇప్పటివరకు 53 మంది విద్యార్థులతో కొత్త ఆవిష్కరణలు చేయించారు. రిటైరయ్యేలోగా మరో 47 మందితో ఆవిష్కరణలు చేయిస్తానని ధీమాగా చెబుతున్నారు. ఆయన మూడుసార్లు పెద్దపల్లి జిల్లాస్థాయి, ఒకసారి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. 2022లో ఏటీఏపీ జాతీయ పురస్కారం, 2024లో సౌత్ ఇండియా టీచర్స్ సైన్స్ ఫెస్టివల్‌లో అవార్డు అందుకున్నారు.

గిరిజనానికి జ్వరం

- మంచంపట్టిన పల్లెలు
- విజృంభిస్తున్న విషజ్వరాలు
- ఇంటికొకరు జ్వర బాధితులు
- కొరవడిన పారిశుధ్య నిర్వహణ
- కంపుకొడుతున్న గ్రామాలు



ఇతను వీర్నపల్లిలోని శాంతినగర్ గ్రామానికి చెందిన రాంరెడ్డి. రాంరెడ్డి కుటుంబంలో అందరికీ జ్వరాలు వస్తున్నాయి. మూడు రోజులపాటు సిరిసిల్ల ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొందినా తగ్గకపోవడంతో వీర్నపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందుతున్నాడు.



సెలైన్ ఎక్కించుకుంటున్న ఈమె వీర్నపల్లి మండలం బావుసింగ్‌తండాకు చెందిన గిరిజన మహిళ గుగులోత్ మంజుల. పది రోజుల క్రితం జ్వరం రావడంతో ఎల్లారెడ్డిపేట మండలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంది. ఇందుకోసం రూ.20వేల వరకు హాస్పిటల్ బిల్లులు చెల్లించింది. అయినా జ్వరం తగ్గకపోవడంతో వీర్నపల్లికి వచ్చి ఇలా సెలైన్ ఎక్కించుకుంటుంది.



నీళ్లు నిలిచిన ఈ ప్రాంతం వీర్నపల్లి మండల కేంద్రం. స్థానిక పాత గ్రామ పంచాయతీ వెనకాల ఉన్న ఖాళీ ప్రాంతంలో ఇటీవల కురిసిన వర్షానికి నీళ్లు నిలిచాయి. చుట్టుపక్కల ఉన్న ఇళ్లల్లో జ్వరపీడితులు ఉన్నారు. పారిశుధ్య పనులు సక్రమంగా లేక దోమలు పెరిగి జ్వరాలు విజృంభిస్తున్నాయి.



ఇతను వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన అన్నారం రాజేశం. ఇరువై రోజుల క్రితం జ్వరం రావడంతో ఎల్లారెడ్డిపేటలో ని ఓ ప్రైవేటు దావాఖానాలో వైద్యపరీక్షలు చేయించుకోగా రక్త కణాలు 18వేలకు పడిపోయాయని చెప్పారు. వెంటనే కరీంనగర్ వెళ్లాలని తెలపడంతో వైద్యుల సూచనతో కరీంనగర్‌లోని ప్రైవేట్ హాస్పిటల్‌లో 15 రోజులపాటు చికిత్స చేయించుకున్నాడు. దాదాపు రూ.2లక్షల వరకు ఖర్చు అయ్యాయి.

వీర్నపల్లి(సిరిసిల్ల): గిరిజన పల్లెల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. పారిశుధ్య నిర్వహణ లోపంతో పరిసరాలు కంపుకొడుతుండడం.. దోమలు వృద్ధి చెంది జ్వరాలు వస్తున్నాయి. డ్రెయినేజీలు లేక మురికినీరు రోడ్లపై నుంచే ప్రవహిస్తుండడంతో గల్లీలు గలీజుగా మారుతున్నాయి. ఈగలు, దోమలు పెరిగి ఇంటికొకరు జ్వర బాధితులున్నారు. వీర్నపల్లి మండల పరిధిలో 17 జీపీలు ఉండగా దాదాపు అన్ని గ్రామాల్లో ప్రతీ ఇంట్లో జ్వర బాధితులున్నారు. ఒళ్లనొప్పులు, చలిజ్వరాలతో బాధితులు ఆస్పత్రులకు వెళ్తున్నారు.

పేరుకే ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు

వీర్నపల్లి మండల కేంద్రంతోపాటు గర్జనపల్లి గ్రామంలో రెండు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో వైద్యసిబ్బంది సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. ఆ తర్వాత ఎంత పెద్ద ఆపదొచ్చినా ఒక్కరు కూడా కనిపించరు. విధి లేక ప్రైవేట్ ఆర్ఎంపీలను ఆశ్రయిస్తూ గిరిజనం ఆర్థికంగా నష్టపోతున్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తగా ఉండాలి



వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. పల్లె ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు వృద్ధి చెందకుండా చెత్తాచెదారం ఉంచొద్దు. జ్వరమొస్తే జిల్లా ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలి. జ్వరాలు ఉంటే వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తాం. ఎల్లారెడ్డిపేటలోని సీహెచ్‌సీలో రక్తపరీక్ష చేయించుకోవాలి.

– స్రవంతి వైద్యాధికారి, వీర్నపల్లి

మహిళల స్వయం ఉపాధికి రూ.600కోట్లు



కలెక్టరేట్ క్యాంటీన్‌లో అల్పాహారం తింటున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

- బ్యాంకు, స్త్రీనిధి రుణాలకు ప్రణాళిక
- ఆర్థిక స్వావలంబనతో అభివృద్ధి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- కలెక్టరేట్‌లో ఇందిర మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

సిరిసిల్ల: జిల్లాలో మహిళల ఆర్థికాభివృద్ధికి రూ.600 కోట్ల బ్యాంకు, స్త్రీనిధి రుణాలతో ప్రణాళిక రూపొందించామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఇందిర మహిళాశక్తిలో భాగంగా క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో 9,985 మహిళా సంఘాలలో 1,34,498 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. స్వయం ఉపాధి రంగంలో ఆసక్తి ఉన్న మహిళలకు బ్యాంకు రుణాలు ఇప్పించి వారు నిలదొక్కుకునేలా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఇందిర మహిళాశక్తి పథకంలో మహిళల ఉపాధికి 125 రకాల ఉపాధి అవకాశాలు ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంతో ఏటా రూ.20వేల కోట్ల బ్యాంకు రుణాలతో మహిళల ఉపాధికి బాటలు వేస్తున్నామని ఆది శ్రీనివాస్ వివరించారు. మహిళా సాధికారత లక్ష్యంగా ప్రభుత్వం ముందుకుపోతుందని స్పష్టం చేశారు. ఇప్పటికే రైతు రుణమాఫీ చేశామని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని, గృహజ్యోతిలో 200 యూనిట్ల ఉచిత కరెంటు ఇస్తున్నామని, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10లక్షలకు పెంచామన్నారు. ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని తెలిపారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఆర్డీవో శేషాద్రి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, ఎల్‌డీఎం మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్, అదనపు డీఆర్డీవో శ్రీనివాస్, డీపీఎంలు సుధారాణి, పద్మయ్య, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరిత, ప్రధాన కార్యదర్శి రజిత పాల్గొన్నారు. క్యాంటీన్‌లో కలెక్టర్‌తో కలిసి అల్పాహారం భుజించారు.

పిల్లల ఎత్తు, బరువు కొలవాలి

రుద్రంగి(వేములవాడ): అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎత్తు, బరువు తప్పనిసరిగా కొలవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. పోషణమాసంలో భాగంగా రుద్రంగిలోని ఆరు అంగన్‌వాడీ కేంద్రాలను ఒక చోట చేర్చి వీహెచ్ఎన్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలు వివరించారు. పిల్లల ఎత్తు, బరువు ఆధారంగా పోషకాహారం అందివ్వాలని సూచించారు. స్థానిక కేజీబీవీని సందర్శించారు. అనంతరం రుద్రంగిలోని శ్మశానవాటికను పరిశీలించారు. అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, డీఎంహెచ్‌వో వసంతరావు, సీడీపీవో సుచరిత, సూపర్‌వైజర్ మమత, రుద్రంగి తహసీల్దార్ శ్రీలత, ఎంపీవో సుధాకర్ ఉన్నారు.

నిత్యాన్నదాన సత్రం ఏర్పాటుకు సన్నాహాలు



వేములవాడ: రానున్న కార్తీకమాసం నుంచి రాజన్న భక్తుల నిత్యాన్నదాన సత్రం కోసం గుడి చెరువు ఖాళీ స్థలాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా పరిశీలించారు. విప్ శ్రీనివాస్ మాట్లాడుతూ నిత్యం 15 వేల మందికి భోజనాలు అందించేందుకు వీలుగా గుడి చెరువు ఖాళీ స్థలంలో భవనం నిర్మించేలా ఈనెల 7వ తేదీలోపు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆలయ అధికారులను ఆదేశించారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్ ఉన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

- 28న జాతీయ లోక్ అదాలత్
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత

సిరిసిల్లకల్చరల్: లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత కోరారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో బుధవారం పోలీస్ అధికారులతో సమావేశమయ్యారు. జిల్లా జడ్జి ప్రేమలత మాట్లాడుతూ గత అదాలత్ రోజున 2,458 కేసులు పరిష్కరించగలిగామని, ఇప్పుడు ఆ సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలోని పోలీస్‌స్టేషన్లలో పరిష్కరించతగ్గ కేసుల వివరాలు తెలుసుకున్నారు. సీనియర్ సివిల్ జడ్జి రాధికా జైస్వాల్, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు ఎ.ప్రవీణ్, కావేటి సృజన, జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: గణేశ్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ కోరారు. వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందుకెళ్లాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందన్నారు. ఈనెల 7 నుంచి ప్రారంభమయ్యే గణపతి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. ఇప్పటికే మత పెద్దలతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేసినట్లు తెలిపారు. మండపాలు ఏర్పాటు చేసేవారు విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు, వృద్ధులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు చిన్న సైజ్ స్పీకర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద, శోభాయాత్ర సమయంలో డీజేలు పెట్ట వద్దని సూచించారు.

రాజకీయాలకు పావులుగా మారాం

- కేటీఆర్‌ది స్వార్థ రాజకీయం
- బండి సంజయ్ పట్టించుకోని వైనం
- నేతన్నల సంచలన వ్యాఖ్యలు



మాట్లాడుతున్న ఆసాముల సంఘం పెద్దలు రవిందర్, అశోక్

సిరిసిల్లటౌన్: ఆకలి చావులు..ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న సిరిసిల్ల నేతన్నలను ప్రభుత్వ, ప్రతిపక్షాలు రాజకీయ పావులుగా చూస్తున్నాయని ఆసాముల సంఘం పెద్దలు విమర్శించారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరులతో ఆసాముల సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, ప్రధాన కార్యదర్శి చేరాల అశోక్ మాట్లాడారు. ఉరిసిల్లను సిరిసిల్లగా మార్చామని బీఆర్ఎస్ నేతలు, నేతన్నలను అన్ని విధాలుగా ఆదుకుంటామని కాంగ్రెసోళ్లు చెబుతున్నా.. ఎవరూ ఆదుకోవడం లేదన్నారు. ఎంపీ బండి సంజయ్‌ను ఎన్నిసార్లు కలిసినా ఉపయోగం లేకుండా పోతుందన్నారు. ఎనిమిది నెలలుగా కుంటుపడ్డ వస్త్రపరిశ్రమ, ఆర్థిక ఇబ్బందులతో నేతన్నల ఆత్మహత్యలు ఎవరి పాపమని ప్రశ్నించారు. వారంలో రెండు రోజులు సిరిసిల్లలో ఉంటానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే కేటీఆర్ ఇప్పుడు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆర్డర్లు లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో కరెంటు బిల్లులు విధిస్తుండడంపై ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్నాళ్లు బడా సేట్లు ప్రభుత్వ ఆర్డర్లతో కోట్లు గడించారని, ప్రభుత్వ బకాయిలు రాలేదన్న పేరుతో తమకు పనులు కల్పించకుండా ఉంటున్నారన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కడుపునిండా తిండికి లేకుండా.. పిల్లలకు స్కూలు ఫీజులు కట్టలేని దుర్భరస్థితిని ఎదుర్కొంటున్నారన్నారు. మండల రాజు, ఆడెపు సాగర్, దూడం శ్రీనివాస్, రాజనర్సు, ఆనందం, సత్యనారాయణరెడ్డి, రాజమౌళి, సాగర్, రమేశ్, కార్తీక్ ఉన్నారు.

క్లుప్తంగా

మల్టీలెవల్ మార్కెటింగ్‌ను నమ్మొద్దు : ఎస్పీ

సిరిసిల్లక్రైం: తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు వస్తాయనే ఆశతో మల్టీ లెవెల్ మార్కెటింగ్‌లో పెట్టి మోసపోవద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం ప్రకటనలో కోరారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించి సహాయం పొందాలని సూచించారు. జిల్లాలో కొంత మంది ఎలక్ట్రానిక్ షాప్ యజమానులు, వ్యాపారులు ఈ విధమైన మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అలాంటి వారి వివరాలు తెలిస్తే పోలీస్‌శాఖకు తెలపాలని కోరారు.

ఎగువమానేరు ఆయకట్టుకు సాగునీరు

- నీటిపారుదలశాఖ ఈఎన్‌సీ శంకర్



ముస్తాబాద్‌లో మానేరు ప్రాజెక్టు కెనాల్స్‌ను పరిశీలిస్తున్న ఈఎన్‌సీ శంకర్

ముస్తాబాద్(సిరిసిల్ల): ఎగువమానేరు ప్రాజెక్టు ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందించేందుకు కృషి చేస్తామని నీటిపారుదలశాఖ ఈఎన్‌సీ శంకర్ పేర్కొన్నారు. ముస్తాబాద్, గూడూరు, నామాపూర్, తెర్లుమద్ది గ్రామాల్లో ఎగువమానేరు ప్రాజెక్టు కెనాల్స్‌ను బుధవారం పరిశీలించారు. ఈఎన్‌సీ శంకర్ మాట్లాడుతూ ఎగువ మానేరు ప్రాజెక్టు మరమ్మతుకు అందించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపి, నిధులు మంజూరు చేసేలా చూస్తామన్నారు. చాలా చోట్ల కెనాల్ షట్టర్లు, లైనింగ్ దెబ్బతిందన్నారు. వీటి మరమ్మతుకు ఇప్పటికే ఇక్కడి ఇంజినీర్లు పంపిన ప్రతిపాదనలు అందినట్లు తెలిపారు. డీఈఈ రవికుమార్, ఏఈలు వంశీ, దివ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు తదితరులున్నారు.

ఎల్‌ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నుంచి బుధవారం ఎల్‌ఎండీకి 3,300 క్యూసెక్కులు, అనంతగిరి ప్యాకేజీ–10లోకి 6,400 క్యూసెక్కుల మేర నీరు విడుదల చేశారు. ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి 10,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టులో 21.688 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

జిల్లాలో ముసురువాన

సిరిసిల్ల: జిల్లాలో బుధవారం వర్షం ముసురుకుంది. ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లో అత్యధికంగా 82.8 మిల్లీమీటర్ల వర్షం పడగా.. తంగళ్లపల్లి మండలం నేరెళ్లలో 43.8, ముస్తాబాద్ మండలం నామాపూర్‌లో 30.8 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. మండలాల వారీగా పరిశీలిస్తే ఇల్లంతకుంటలో అత్యధికంగా 31.8 మిల్లీమీటర్లు, రుద్రంగిలో 14.9, చందుర్తిలో 7.4, వేములవాడ రూరల్‌లో 4.8, బోయినపల్లిలో 9.5, వేములవాడలో 5.3, సిరిసిల్లలో 11.1, కోనరావుపేటలో 6.1, వీర్నపల్లిలో 11.3, ఎల్లారెడ్డిపేటలో 16.6, గంభీరావుపేటలో 22.9, ముస్తాబాద్‌లో 31.3, తంగళ్లపల్లిలో 27.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

- కాలానుగుణంగా బోధనలో మార్పులు
- విద్యార్థులతో మమేకమవుతున్న ఉపాధ్యాయులు
- ప్రయోగాత్మకంగా.. క్షేత్రస్థాయిలో పాఠాలు
- సర్కారు బడులకు ప్రాణం పోస్తున్న వైనం
- ఆదర్శంగా నిలుస్తున్న పలువురు ఉమ్మడి జిల్లా టీచర్లు
- నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

గురుభ్యోనమః



మన జీవితంలో ఉన్నత స్థానం గురువుకు ఇస్తాం. మనల్ని జ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి వెలకట్టలేనిది. అలాంటి గొప్ప వ్యక్తులను స్మరించుకుంటూ మన దేశ రెండో రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఏటా సెప్టెంబర్ 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నాం. కాలానుగుణంగా విద్యాబోధనలో మార్పులొస్తున్నాయి. టీచర్లు విద్యార్థులతో మమేకమవుతూ, ప్రయోగాత్మకంగా పాఠాలు చెబుతున్నారు. జీవితంలో ఎదుర్కొనే సమస్యలపై అవగాహన కల్పిస్తూ వారి భవిష్యత్‌కు భరోసానిస్తున్నారు. నేడు నేషనల్ టీచర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు ఆదిత్య

ఎనిమిదేళ్లుగా సెలవు తీసుకోలే..

తిమ్మాపూర్: తిమ్మాపూర్ మోడల్ స్కూల్ ఇంగ్లిష్ పీజీటీగా పనిచేస్తున్న జి.ఆదిత్య ఎనిమిదేళ్లుగా ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదు. డీఎస్సీ–2003 బ్యాచ్‌లో టాపర్‌గా నిలిచి మంచిర్యాల జిల్లా తాండూరు మండలం రేచిని జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేశారు. 2011లో పీజీటీగా ఉద్యోగం సాధించి 2013 జూన్ 19న తిమ్మాపూర్‌లోని మోడల్ స్కూల్‌లో ఇంగ్లిష్ టీచర్‌గా చేరారు. ఏటా పబ్లిక్ పరీక్షల్లో ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో 100 శాతం ఫలితాలు సాధిస్తున్నారు. 2018లో రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు. చాలామంది విద్యార్థులు పోలీసు, డిఫెన్స్ ఉద్యోగాలు సాధించేందుకు కృషి చేశారు.

భవిష్యత్‌కు భరోసా



తిరుపతి

కరీంనగర్: హుజూరాబాద్ మండలంలోని కందుగుల జెడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్(సోషల్) ఓరుగంటి తిరుపతి విద్యార్థులతో ఫీల్డ్ విజిట్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. వనరుల వినియోగం, చెరువుల సందర్శన, చేనేత కార్మికులు, జానపద కళాకారుల జీవన స్థితిగతులపై వారిని నేరుగా తీసుకెళ్లి, అవగాహన కల్పిస్తున్నారు. రిసోర్స్ పర్సన్‌గానూ చేశారు. సామాజిక రుగ్మతలు, సైబర్ నేరాలను పిల్లలకు వివరిస్తూ భవిష్యత్‌కు భరోసా కల్పిస్తున్నారు.

ప్రయోగాలతో బోధన



ప్రయోగంతో విద్యార్థులకు పాఠం చెబుతున్న చంద్రశేఖర్

కథలాపూర్: కథలాపూర్ మండలం భూషణరావుపేట గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ సైన్స్ టీచర్ సంక చంద్రశేఖర్ విద్యార్థులకు పాఠ్యాంశాలు సులువుగా అర్థం కావాలని ప్రయోగాలతో బోధిస్తున్నారు. ఈ ఉపాధ్యాయుడి ఆధ్వర్యంలో తయారు చేసిన స్పైరల్ స్క్రూ, నీళ్లను వేడి చేయడం, కుంభాకర కటకంతో ప్రతిబింబాలు అనే ప్రయోగాలు రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయి. ప్రయోగాలతో విద్యార్థులకు వివరిస్తే త్వరగా పాఠాలు అర్థమవుతాయని పేర్కొన్నారు.

సేవ.. బోధన.. రాష్ట్రస్థాయి గుర్తింపు



అంజన్‌కుమార్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం టీటీఎస్ జెడ్పీ హైస్కూల్ జీవశాస్త్ర ఉపాధ్యాయుడు గూళ్ల అంజన్‌కుమార్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. 10వ తరగతి బయోలాజికల్ సైన్స్‌లో విద్యార్థులు 10 జీపీఏ సాధించేలా సాంకేతికతను జోడిస్తూ బోధిస్తున్నారు. 2022లో విద్యారత్న జాతీయ అవార్డు అందుకున్నారు. పెద్దపల్లి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో 80 యూనిట్ల రక్తాన్ని అందించారు. ఎన్నికలకు మాస్టర్‌ట్రైనర్‌గా, విద్యాశిక్షణకు రిసోర్స్‌పర్సన్‌గా పనిచేస్తూ.. ఉన్నతాధికారుల మన్ననలు పొందారు.

పాఠాలను కథలుగా చెబుతూ..



అనసూయ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరు జెడ్పీ పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు ఎడవల్లి అనసూయ విద్యార్థులకు కథల ద్వారా విద్యాబోధన చేయడం ద్వారా గుర్తింపు పొందారు. 1984లో ఎస్‌జీటీగా చేరి, 2002లో పదోన్నతి పొంది, ఎస్‌ఏగా పనిచేస్తున్నారు. పన్నెండేళ్లుగా నగునూరు స్కూల్లో విద్యార్థులకు కథల ద్వారా పాఠాలు బోధిస్తున్నారు. పుస్తకాలపై విద్యార్థులకు ఆసక్తి కలిగిస్తున్నారు. దశాబ్దకాలంగా ఎస్సెస్సీ వార్షిక పరీక్షల్లో తెలుగులో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నారు.

టీ–శాట్ బోధన



మార రమేశ్

పెద్దపల్లిరూరల్: రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు దీక్ష పోర్టల్, ఐఎఫ్‌బీ ప్యానల్‌కు డిజిటల్ కంటెంట్ తయారు చేయడంతోపాటు టీ–శాట్ ఛానల్ ద్వారా బ్రిడ్జి కోర్సు విద్యార్థులకు డిజిటల్ తరగతులు బోధించారు పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల సోషల్ టీచర్ మార రమేశ్. ఆయన రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు.

ఆర్పీగా టీచర్లకు సహకారం



రఘుపతిరావు

రామగుండం: సాదినేని రఘుపతిరావు ఉమ్మడి రామగుండం మండల రిసోర్స్ పర్సన్‌గా ప్రతీ బడిలో టీచర్లకు సంపూర్ణ సహకారం అందించారు. ప్రస్తుతం బ్రాహ్మణపల్లి యూపీఎస్ హెచ్‌ఎంగా పని చేస్తున్నారు. బడిబయట ఉన్న పిల్లలను స్కూళ్లలో చేర్పించడం, వేసవి విద్యా శిబిరాల్లో ప్రత్యేక బోధన, వసతి గృహాల్లో తరగతుల నిర్వహణ, వలస కార్మికుల పిల్లల కోసం స్కూళ్ల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇచ్చారు.

ఉపాధ్యాయుడిగా.. కాలమిస్టుగా



శంకర్ గౌడ్

సిరిసిల్ల ఎడ్యుకేషన్: కోనరావుపేట మండలం మల్కపేటకు చెందిన పాకాల శంకర్ గౌడ్ రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఎస్జీటీగా 1998లో ఉద్యోగ జీవితం ప్రారంభించిన ఆయన పాఠ్యాంశాల బోధనకు ప్రాధాన్యం ఇస్తూనే ఉపాధ్యాయ సంఘం నాయకుడిగా, కాలమిస్టుగా రాణిస్తున్నారు. ప్రస్తుతం కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాల సిరిసిల్లలో స్కూల్ అసిస్టెంట్(ఫిజికల్ సైన్స్)గా పని చేస్తున్నారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచేందుకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారు. 2020 కరోనా కాలంలో విద్యార్థులకు ఆన్‌లైన్ పాఠాలు బోధించారు. డాక్టర్ల సహాయంతో రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా కరోనా హెల్ప్ లైన్ ఏర్పాటు చేశారు. ఆయన గైడ్ టీచర్‌గా తయారు చేసిన పవర్‌లూమ్ క్లాత్ ఫోల్డింగ్ మెషిన్ 2022–23లో ఇన్‌స్పైర్ మనాక్ జాతీయస్థాయి ప్రదర్శనకు ఎంపికైంది.

సొంత ఖర్చుతో మరుగుదొడ్లు



యోగా నేర్పుతున్న రమేశ్‌గౌడ్

సుల్తానాబాద్: స్థానిక అశోక్‌నగర్ ఎంపీపీఎస్‌లో టీచర్‌గా పని చేస్తున్న బి.రమేశ్‌గౌడ్ కార్పొరేట్ తరహాలో విద్యార్థులకు విద్యాబోధన చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. పాఠశాలలో 40 మంది విద్యార్థులు ఉండగా కొత్తగా మరో 50 మందిని చేర్పించాను. అందరికీ యోగా నేర్పిస్తున్నారు. సొంత ఖర్చుతో బాలికలకు, బాలురకు మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించారు. పేద పిల్లలకు నోటుబుక్స్ ఇచ్చారు. తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తూ పిల్లలకు హోంవర్క్ చేయించడంపై సూచనలు చేస్తున్నారు.

పేద పిల్లలను బడిలో చేర్పించా



హుజూరాబాద్‌రూరల్: నేను పని చేస్తున్న పాఠశాల చుట్టుపక్కల ఉండేది అందరూ నిరుపేదలే. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాలు. వారి జీవితాల్లో చదువు అనే వెలుగు లేకపోవడం వల్లే ఇన్ని ఇబ్బందులు పడుతున్నారని భావించాను. అందుకే వారి పిల్లలను బడిబాట కార్యక్రమంలో పాఠశాలలో చేర్పించి, విద్యాబుద్ధులు నేర్పుతున్నాను. నాకు ఎంతో ఆత్మ సంతృప్తి కలుగుతోంది.

– బి.ప్రభాకర్, ఉత్తమ ఉపాధ్యాయుడు, గణేశ్‌నగర్

డిజిటల్ పాఠాల ప్రసారం



నందిని శ్రీనివాస్

కరీంనగర్ కల్చరల్: కరీంనగర్‌లోని కార్ఖానాగడ్డ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నందిని శ్రీనివాస్ డిజిటల్ పాఠాలకు రూపకల్పన చేశారు. వాటిని తెలుగు దళం చానల్ ద్వారా ప్రసారం చేశారు. వాటిని రాష్ట్రవ్యాప్తంగా 40 వేల నుంచి 50 వేల మంది విద్యార్థులు యూట్యూబ్‌లో వీక్షించారు. పిల్లలకు మంచి అలవాట్లు, భగవద్గీత శ్లోకాలు, పాటలు, ధ్యానం నేర్పించడానికి సంస్కార వారధి ద్వారా శిక్షణనిస్తున్నారు. మన రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాలు, మలేషియా, సింగపూర్, అమెరికా వంటి దేశాలకు చెందిన 2 వేల మందికిపైగా చిన్నారులు శిక్షణ పొందారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకులు



డా.పద్మావతి

కరీంనగర్ సిటీ: కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయంలో సోషియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డా.కె.పద్మావతి రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకురాలిగా ఎంపికయ్యారు. 1991లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీజీ, 2001లో ఉస్మానియా యూనివర్సిటీ సోషియాలజీ విభాగం నుంచి డాక్టోరియల్ డిగ్రీ పూర్తి చేశారు. ఆమె మార్గదర్శకత్వంలో ఇద్దరు విద్యార్థులకు డాక్టరేట్ పొందారు. పద్మావతి తెలుగులో 65 వ్యాసాలు, ఆంగ్లంలో 35 వ్యాసాలు రాశారు. సుకన్య సమృద్ధి యోజనపై ఐసీఎస్ఎస్ఆర్ స్పాన్సర్ చేసిన పరిశోధన ప్రాజెక్టుకు కో–డైరెక్టర్‌గా పని చేశారు. శాతవాహన విశ్వవిద్యాలయంలో 2 జాతీయ సెమినార్లు నిర్వహించారు.

జగిత్యాల మహిళా డిగ్రీ కాలేజీ ప్రొఫెసర్



ప్రమోద్‌కుమార్

జగిత్యాల: జగిత్యాల మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ప్రమోద్‌కుమార్ రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడి అవార్డుకు ఎంపికయ్యారు. కథలాపూర్ మండలం తక్కళ్లపల్లికి చెందిన ఆయన కోరుట్లలో విద్యాభ్యాసం పూర్తి చేసి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు చేశారు. అధ్యాపక వృత్తి ఉంటూనే తెలుగు సాహిత్యంలో రాణిస్తూ రచనలు చేశారు. ప్రమోద్‌కుమార్‌ను కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, అధ్యాపకులు అభినందించారు.

కరీంనగర్ ఎస్సారార్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్

కరీంనగర్‌సిటీ: రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా కరీంనగర్ ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.భూర్ల నరేశ్ ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డా.వై.సత్యనారాయణ బుధవారం తెలిపారు. జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన ఆయన 2013 జనవరి 1న అప్పటి పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా నియమితులయ్యారని పేర్కొన్నారు. 12 ఏళ్లుగా కామర్స్ బోధిస్తూ పాఠ్యపుస్తక రచయితగా 5 పుస్తకాలను రచించారన్నారు. 20 జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ఆయన పరిశోధన అంశాలు ప్రచురితమయ్యాయని తెలిపారు.

మద్దతివ్వండి..బాధ్యతగా పనిచేస్తా

- విద్యారంగంలో లెక్చరర్‌గా.. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా
- అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ



బార్ అసోసియేషన్ ప్రతినిధులతో హరికృష్ణ

సిరిసిల్ల: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతునిచ్చి గెలిపిస్తే విద్యారంగ సమస్యలపై బాధ్యతగా పనిచేస్తానని అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ పేర్కొన్నారు. బుధవారం సిరిసిల్లలోని పలు విద్యాసంస్థలను సందర్శించి ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల నిర్వాహకులు, ఉపాధ్యాయులతో భేటీ అయ్యారు. అగ్రహారం డిగ్రీ కళాశాల, వికాస్ డిగ్రీ కళాశాల తోపాటు కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. వికాస్ కళాశాలలో మాట్లాడుతూ పదహారేళ్లుగా బాధ్యతలు నిర్వహిస్తూ ఉద్యమ సమయం నుంచి చురుకుగా పాల్గొంటున్న విషయాన్ని గుర్తుచేశారు. బోయినపల్లి మండలం గుండన్నపల్లి వాసిగా తన స్థానికతను గుర్తు చేస్తూనే పెద్దల సభకు ప్రతినిధిగా విద్యావంతులను ప్రోత్సహించాలని కోరారు. డిగ్రీ కళాశాలల నిర్వాహకులు గుగ్గిళ్ల జగన్‌గౌడ్, గెంట్యాల భూమేశ్, శేఖర్‌రెడ్డి, రేశం శ్రీకాంత్, ట్రస్మా జిల్లా, పట్టణాధ్యక్షులు నాగుల శ్రీనివాస్, యెల్లె శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాకాల శంకర్‌గౌడ్, కుమ్మరి మల్లేశం, గాజుల ప్రతాప్, బుర్రవెంకటేశం, రాజి రెడ్డి, లెక్చరర్లు పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ హాల్‌లో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సంజీవ్‌రెడ్డి, తంగళ్లపల్లి వెంకటి, సీనియర్ న్యాయవాదులు ఆవునూరి రమాకాంత్‌రావు, నర్సింగరావు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



కాలిన గుడిసె వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని అల్మాస్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కాల్‌నాయక్‌తండాలో బుధవారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో ఓ గుడిసె దగ్ధమైంది. తండాకు చెందిన శంకర్ నాయక్–లలిత దంపతులు తమ కూతుళ్లు సంగీత, నందుతో కలిసి తాటికమ్మల గుడిసెలో నివసిస్తున్నారు. బుధవారం రాత్రి షార్ట్‌సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. నిత్యావసర వస్తువులు, విలువైన సామగ్రి కాలిపోయాయి. నిరుపేద కుటుంబం రోడ్డున పడింది. ఈ విషయం తెలుసుకున్న అల్మాస్‌పూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోనవేణి రాజయ్యయాదవ్, నాయకులు సిరిసిల్ల సురేశ్, శెట్టిపెల్లి బాలయ్య, రవినాయక్ బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని కోరారు.

గుండెపోటుతో రైతు మృతి

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేటకు చెందిన రైతు ఏనుగుల మల్లయ్య(57) బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. రోజు మాదిరిగానే ఉదయం పొలం వద్ద ఉన్న గేదెలపాలు పితికేందుకు వెళ్లి, అక్కడే కుప్పకూలి మృతిచెందాడు. అక్కడే ఉన్న మల్లయ్య భార్య రోదనలు మిన్నంటాయి.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



చందుర్తి(వేములవాడ): వైద్యసిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి వసంతరావు హెచ్చరించారు. చందుర్తి పీహెచ్‌సీని బుధవారం తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది హాజరుపట్టికను, రిజిష్టర్లను తనిఖీ చేశారు. రోగులకు ఏయే మందులు పంపిణీ చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రోగ్రాం అధికారి అంజిలా ఉన్నారు.

లోతట్టు ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి

సిరిసిల్లటౌన్: భారీ వర్షాలకు దెబ్బతిన్న లోతట్టు ప్రాంతాల్లోని ప్రజల సమస్యల పరిష్కారంపై బల్దియా దృష్టి సారించింది. ఈమేరకు బుధవారం శాంతినగర్, శ్రీనగర్‌కాలనీల్లో మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్ సిబ్బందితో కలిసి పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కొత్తచెరువు నుంచి నీటిని ఒకేసారి వదలడంతో సమస్యలు వస్తున్నాయని తెలిపారు. రోగాలు ప్రబలకుండా ఆయిల్‌బాల్స్ స్ప్రే, బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తామన్నారు. ఓపెన్‌ప్లాట్లలో నీటి నిల్వలపై స్థల యజమానులకు నోటీసులు అందిస్తున్నట్లు తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



లీజ్‌కు బీఎస్‌ఎన్‌ఎల్ భవనం

బోయినపల్లి(వేములవాడ): ఒకప్పుడు కళకళలాడిన బీఎస్‌ఎన్‌ఎల్ భవనం.. నేడు వెలవెలబోతోంది. సెల్‌ఫోన్ల హవా నడుస్తుండడంతో ల్యాండ్‌లైన్లు మూలకుపడ్డాయి. దీంతో బోయినపల్లిలోని బీఎస్‌ఎన్‌ఎల్ భవనం నిరుపయోగంగా మారింది. ఖాళీగా ఉంటున్న భవనాన్ని అద్దెకు ఇచ్చేందుకు ఆ శాఖ నిర్ణయించింది. ఈమేరకు భవనాన్ని లీజ్‌కు ఇవ్వబడును అని బోర్డు ఏర్పాటు చేశారు. ఈ బోర్డు చూసిన స్థానికులు ఒకప్పుడు ఎలా ఉండే.. ఇప్పుడు ఇలా మారిందని చర్చించుకుంటున్నారు.

వైద్యులకు రక్షణ కల్పించాలి



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వినతిపత్రం అందిస్తున్న డాక్టర్ సురేంద్రబాబు

సిరిసిల్ల: వైద్యులకు రక్షణ కల్పించాలని, పనిచేసే చోట భద్రత చర్యలు చేపట్టాలని కోరుతూ నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుండ్లూరు సురేంద్రబాబు బృందం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను బుధవారం రాజ్‌భవన్‌లో కలిసి వినతిపత్రం అందించారు. ఇటీవల కోల్‌కతాలో జరిగిన దారుణ విషాదాన్ని ఉదహరిస్తూ ఆరోగ్య సంరక్షకులకు రక్షణ లేకుండా పోవడంపై ఎన్‌ఎంవో బృందం ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం దీనిపై స్పందించి ఆరోగ్య మంత్రిత్వ శాఖ కఠిన విజిటర్ పాస్ విధానం అమలు చేయాలని కోరారు. ఆస్పత్రి ప్రాంగణంలో రక్షణ ఏర్పాట్లు చేయాలని, పోలీస్‌గస్తీ పెంచాలని కోరారు.

ఇంటికి చేరకముందే అనంతలోకాలకు..

- దుబాయ్ నుంచి నేరుగా ఆస్పత్రికి
- అయినా దక్కని ప్రాణం
- అనారోగ్యంతో గల్ఫ్ కార్మికుడి మృతి



అన్నవేని స్వామి(ఫైల్)

రుద్రంగి(వేములవాడ): ఉన్న ఊరిలో ఉపాధి లేక పొట్ట చేత పట్టుకొని గల్ఫ్ దేశం వెళ్లిన వ్యక్తి అక్కడ అనారోగ్యంబారిన పడి ఇంటికి చేరకముందే తనువు చాలించాడు. ఈ సంఘటనలో రుద్రంగిలో విషాదం నింపింది. రుద్రంగికి చెందిన అన్నవేని స్వామి(32) ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. అక్కడే అనారోగ్యం బారినపడి ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాడు. అయినా ఆరోగ్యం బాగుకాకపోవడంతో సోమవారం దుబాయ్ నుంచి వచ్చి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాడు. ఈక్రమంలో పరిస్థితి విషమించడంతో మంగళవారం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. ఉపాధి కోసం దుబాయ్ వెళ్లి, తిరిగి ఇంటికి చేరకముందే అనంత లోకాలకు వెళ్లితివా.. అంటూ కుటుంబ సభ్యుల రోదనలు కంట తడి పెట్టించింది. మృతుడు స్వామికి భార్య హారిక, కూతుళ్లు నవనీత, శ్రీవాణి, కొడుకు శ్రావణ్ ఉన్నారు.

విషజ్వరంతో బాలుడి మృతి

- కుటుంబంలో విషాదం



హనీశ్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విషజ్వరంతో బాధపడుతూ.. ఓ బాలుడు మృతిచెందాడు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కన్నకొడుకు మరణంతో ఆ దంపతులు గుండెలవిసెలా రోదించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన తుడుం రవళి–అజయ్ దంపతుల కుమారుడు హనీశ్(30 నెలలు) మంగళవారం జ్వరం బారిన పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు బాలుడిని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని, కరీంనగర్‌కు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. దీంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సిరిసిల్ల ఏరియా ఆస్పత్రిలో వెంటిలేటర్ ఉంటే తమ కొడుకు బతికేవాడని వారు రోదించడం కలచివేసింది. ఈ ఘటనపై మండల వైద్యాధికారిణి స్రవంతి ఆధ్వర్యంలో బుధవారం వైద్యబృందం విచారణ చేపట్టింది. మృతుడు హనీశ్ ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి, మరణానికి దారితీసిన కారణాలు తెలుసుకున్నారు.

డీఆర్‌సీసీ సెంటర్ నిర్వహణకు వేలం

సిరిసిల్లటౌన్: తడి, పొడిచెత్త సేకరణ కేంద్రం(డ్రై రీసోర్స్ కలెక్షన్ సెంటర్) నిర్వహణకు 2024–25 ఏడాదికి బహిరంగవేలం వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రకటనకు అదనంగా మరో రెండు రోజులు దరఖాస్తుల స్వీకరణ గడువు పెంచినట్లు వెల్లడించారు. ఆసక్తి గల మహిళా స్లమ్ సమాఖ్య సంఘాలు ఈనెల 6వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు ఆఫీస్‌లో దరఖాస్తు అందజేయాలని సూచించారు.